క్లుప్తంగా

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

బీఎస్పీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్



పోలీసుల అదుపులో బీఎస్పీ నాయకులు

కేశంపేట: అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపలేరని బీఎస్పీ మండల అధ్యక్షుడు సొంటె శ్రీనివాస్ అన్నారు. మంత్రి కేటీఆర్ షాద్‌నగర్ పర్యాటన సందర్భంగా మండలంలో బీఎస్పీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుందని అందుకే ఎక్కడ మంత్రులు కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఉద్యమ నాయకులను ముందస్తుగా అరెస్టు చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపించేందుకు ప్రజలు ఇప్పటికే సిద్ధమయ్యారన్నారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో భీమయ్య, హరికుమార్ ఉన్నారు. అనంతరం వీరిని సొంతపూచీకత్తు పైన విడుదల చేశారు.

యువత ఉన్నతంగా ఎదగాలి



సురేశ్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ వీరేశ్

కేశంపేట: యువత కష్టపడి చదివి ఉన్నతంగా ఎదగాలని చౌలపల్లి సర్పంచ్ గూడ వీరేశ్ అన్నారు. బుధవారం ప్రభుత్వం ప్రకటించిన కానిస్టేబుల్ ఫలితాల్లో గ్రామానికి చెందిన ఎ.సురేశ్, ఎస్.శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను గురువారం సర్పంచ్ గ్రామస్తులతో కలిసి సన్మానించి అభినందనలు తెలిపారు. మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన సొప్పరి శిరీష, ఫణి కుమార్, మహేశ్, ప్రకాశ్, వినయ్, శ్రీనునాయక్‌లు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.

ముందస్తు అరెస్టులు

మొయినాబాద్: ఆశ వర్కర్ల చలో కలెక్టరేట్ కార్యక్రమం నేపథ్యంలో పోలీసులు ముందస్తు అరెస్టులు చేపట్టారు. గురువారం తెల్లవారుజామున సీఐటీయూ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆశ వర్కర్లను అరెస్టు చేసి మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వీరిని సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం పోలీసులను అడ్డం పెట్టుకుని ఉద్యమాలను ఆపే ప్రయత్నం చేస్తుందన్నారు. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటం ఆగదని హెచ్చరించారు.

‘చెవిలో పువ్వు చేతిలో చిప్ప’

నిరసన వ్యక్తం చేసిన మధ్యాహ్న భోజన కార్మికులు



చెవిలో పువ్వు చేతిలో చిప్పతో ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

కేశంపేట: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు నిరవధిక సమ్మెను కొనసాగిస్తున్నారు. సమ్మెలో భాగంగా గురువారం మధ్యాహ్న భోజన కార్మికులు ‘చెవిలో పువ్వు చేతిలో చిప్ప’ కార్యక్రమం ద్వారా ప్రభుత్వంపై తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకు ఫిక్స్‌డ్ వేతనంను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యమ్మ, లలిత, వెంకటమ్మ, సావిత్రి, అక్కమ్మ, కళావతి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్లకు తరలిన ముదిరాజ్‌లు



ర్యాలీలో పాల్గొన్న ముదిరాజ్‌లు

మొయినాబాద్: పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ, బహిరంగ సభకు ముదిరాజ్‌లు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. గురువారం మండల పరిధిలోని చిలుకూరు మల్లికార్జున స్వామి దేవాలయం నుంచి భారీ ర్యాలీగా చేవెళ్లకు బయలుదేరారు. ఆలయం నుంచి నుంచి మొయినాబాద్ మండల కేంద్రం వరకు పెద్ద ఎత్తున ర్యాలీ చేపట్టారు. ముదిరాజ్‌ల ఐక్యత చాటి, రాజ్యాధికారం దిశగా ముందడుగు వేయాలని ముదిరాజ్ నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్‌ముదిరాజ్, సంఘం నాయకులు శ్రీరాములు, యాదయ్య, శ్రీనివాస్, మల్లేశ్, వెంకటేశ్ తదితరులున్నారు.

అడుగడుగునా జన నీరాజనం



నందిగామ: చాకలిగుట్టతండా పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్



కొత్తూరు: చైర్‌పర్సన్ లావణ్యను తన చాంబర్‌లో కూర్చోబెట్టి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రులు కేటీఆర్, మహేందర్‌రెడ్డి

- మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలికిన గులాబీ శ్రేణులు
- చాకలిగుట్ట తండాలో పంచాయతీ కార్యాలయం ప్రారంభం
- కొత్తూరులో మున్సిపల్ కార్యాలయం..

నందిగామ: మంత్రి కేటీఆర్‌కు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘన స్వాగతం పలికారు. మండల పరిధిలోని చాకలిగుట్టతండా సమీపంలో ఉదయం 10.55గంటల ప్రాంతంలో హెలికాప్టర్ దిగిన కేటీఆర్‌కు స్థానిక ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పాటు స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కేటీఆర్‌తో పాటు మంత్రి మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ర్యాలీగా వెళ్లి సర్పంచ్ రాజునాయక్ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పంచాయితీ ఆవరణలో ప్రతిష్టించిన మహనీయుల విగ్రహాలను మంత్రి ఆవిష్కరించారు.

బైక్‌ర్యాలీగా సభకు

పాత జాతీయ రహదారిపై పారిశ్రామిక వాడనుంచి అయ్యప్ప స్వామి టెంపుల్, నందిగామ, చంద్రాయన్‌గూడల మీదుగా షాద్‌నగర్ వరకు బైక్ ర్యాలీగా తీశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, ఎంపీపీ ప్రియాంక, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, పీఏసీఎస్‌ల చైర్మన్లు అశోక్, రాజ్‌గోపాల్, మంజుల, పీఏసీఎస్ మాజీ చైర్మన్ విఠల్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ఇళ్ల శిలాఫలకం ఆవిష్కరణ

కొత్తూరు: పట్టణంలో రూ.3.50 కోట్లతో నూతనంగా నిర్మించిన కొత్తూరు మున్సిపల్ కార్యాలయాన్ని గురువారం మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మంత్రి పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి డబుల్‌బెడ్ రూం ఇళ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్యకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తూరు జర్నలిస్టులు తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైస్ చైర్మన్ రవీందర్, నాయకులు దేవేందర్‌యాదవ్, కృష్ణ, జనార్థన్‌రెడ్డి, నారాయణరెడ్డి, కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఆదరిస్తే అండగా ఉంటాం

- తెలంగాణ అభివృద్ధి దేశానికే ఆదర్శం
- ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



దబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్‌రూరల్: అభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ అన్నారు. గురువారం పట్టణంలో మంత్రి కేటీఆర్ పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా పట్టణ సమీపంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడని, నిరంతరం ప్రజా సేవకోసమే పరితపిస్తారని అన్నారు. గత ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. చెరువులకు మిషన్ కాకతీయతో జలకళ తీసుకు వచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. ప్రజలకు తాగునీరు, రైతులకు సాగు నీరందించేందుకు ప్రాజెక్టులను కట్టారని అన్నారు. లక్ష్మీదేవిపల్లి ఈ ప్రాంత నాయకులకు తెలియదని కేసీఆర్ గుర్తించారని అన్నారు. లక్ష్మీదేవిపల్లిపై కొందరు నేతలు ఆరోపణలు చేయడం సరికాదని, ప్రాజెక్టు వద్దని కేసులు వేసిన నాయకులే ఇప్పుడు ప్రాజెక్టు నిర్మించాలని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. త్వరలోనే ప్రాజెక్టు పూర్తిచేసి ఈ ప్రాంత రైతాంగానికి సాగు నీరందిస్తామన్నారు. కొత్తూరు మండలం సిద్దాపూర్‌లో ఐటీ హబ్‌ను ఏర్పాటుచేసి ఇక్కడి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలను కల్పించాలని కోరారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలువిని మోసపోవద్దని, అభివృద్ధి చేసిన బీఆర్‌ఎస్‌ను ఆదరిస్తే అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, వైస్ చైర్మన్ ఈట గణేశ్, మాజీ ఎమ్మెల్యేలు కిష్టయ్య, ఇందిర, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ మన్నె కవితయాదవ్, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, మున్సిపల్ చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లు, సింగిల్‌విండో చైర్మన్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శభాష్ అవినాశ్..



చెక్కు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

షాబాద్: వారం రోజుల క్రితం మంత్రి కేటీఆర్ పర్యటన సభకు వచ్చి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన అంతారం గ్రామానికి చెందిన ఈగ సురేందర్‌రెడ్డి కుటుంబానికి షాబాద్ జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి అండగా నిలిచారు. గురువారం రూ.10లక్షల ఆర్థికసాయం బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్, మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునితారెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేశారు. బీఆర్‌ఎస్ పార్టీ తరుపున మరో రూ.2లక్షలు ఇస్తామని మంత్రి కేటీఆర్ ప్రకటించారు. పార్టీ కార్యకర్త కుటుంబాన్ని ఆదుకునేందుకు ముందుకు వచ్చిన జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డిని మంత్రి కేటీఆర్ శభాష్... అవినాశ్... అంటూ అభినందించారు. ఈకార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద్‌పటేల్, సర్ధార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, నాయకులు మధుసూదన్‌రెడ్డి, టీఎల్‌ఎఫ్ జిల్లా నాయకుడు పీసరి సతీశ్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజేందర్‌రెడ్డి తదితరులున్నారు.

ఆడబిడ్డలకు ప్రభుత్వ కానుక

షాబాద్ వైస్ ఎంపీపీ లక్ష్మి



షాబాద్: అంగన్‌వాడీ టీచర్లకు చీరలు పంపిణీ చేస్తున్న లక్ష్మి, సుబ్రమణ్యేశ్వరి

షాబాద్: బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకోవాలనే భావనతో ఆడబిడ్డలలకు కానుకగా ప్రభుత్వం బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తోందని వైస్ ఎంపీపీ లక్ష్మి అన్నారు. గురువారం మండల పరిధిలోని ముద్దెంగూడ, మల్లారెడ్డిగూడ, షాబాద్, హైతాబాద్ గ్రామాలల్లో మహిళలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలతో కలిసి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతీ పేదవాడు తలెత్తుకునేలా సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందన్నారు. బతుకమ్మ పండుగ సందర్భంగా 15,600 మందికి చీరలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మహిళలకు తన చేతుల మీదుగా చీరలు పంపిణీ చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కుమ్మరి చెన్నయ్య, సర్పంచ్‌లు చందిప్ప జంగయ్య, సుబ్రమణ్యేశ్వరి, మల్లేశ్,జయమ్మ తదితరులున్నారు.

ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు

ఎంపీపీ నక్షత్రం



బతుకమ్మ చీరలు, పింఛన్ మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

మొయినాబాద్: ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి అందుతున్నాయని ఎంపీపీ నక్షత్రం, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్ అన్నారు. మండల పరిధిలోని సురంగల్‌లో గురువారం బతుకమ్మ చీరలు, పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ సంవత్సరం మహిళలకు సీఎం కేసీఆర్ బతుకమ్మ చీరలను కానుకగా అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలు ఉపయోగించుకోవాలన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి సహకారంతో చేపడుతున్న చేవెళ్ల ఆరోగ్య రథం సేవలను గురువారం సురంగల్‌లో ప్రారంభించారు. ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లావణ్యారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రవుఫ్, మాజీ సర్పంచ్ రాంచంద్రయ్య, మాజీ ఉపసర్పంచ్ గడ్డం అంజిరెడ్డి నాయకులు భాస్కరాచారి, ఎట్టయ్యగౌడ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ ఇళ్లను స్థానికులకే ఇవ్వాలి

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

శంకర్‌పల్లి: శంకర్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను స్థానికులకే కేటాయించాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి తొండ రవి అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లను నగర వాసులకు కేటాయించడం సరికాదన్నారు. ఇళ్ల పంపిణీ విషయంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య విఫలమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జరిగిన ఎమ్మెల్యే, స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నిల్లో శంకర్‌పల్లిలో నిర్మిస్తున్న డబుల్‌బెడ్ రూం ఇళ్లను ఇప్పిస్తామని చెప్పారని.. మళ్లీ ఏ విధంగా ఓట్లను అడిగేందకు వస్తారని మడిపడ్డారు. వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీకి ఓటమి తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల అసెంబ్లీ కన్వినర్ ప్రతాప్‌రెడ్డి, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్‌సింగ్, మున్సిపల్ అధ్యక్షుడు బీర్ల సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

తండాలకు స్వచ్ఛమైన తాగునీరు

- పాలమూరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి
- పాల్కొనిగుట్ట, శ్యాంరావుతండాల్లో వాటర్‌ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ



వాటర్ ప్లాంట్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: అభివృద్ధికి దూరంగా ఉన్న తండాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందిచేందుకు పాలమూరు చారిటబుల్ ట్రసస్ట్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తుందని ట్రస్ట్ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పాల్కొనిగుట్టతండా, శ్యాంరావుతండాల్లో వాటర్‌ప్లాంట్‌ల ఏర్పాటుకు గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. నేటికీ గిరిజన తండాలు అభివృద్ధికి దూరంగా ఉన్నాయన్నారు. బీజేపీని గెలిపిస్తేనే తండాల అభివృద్ధి సాధ్యమన్నారు. అనంతరం కొత్తపేటలో యువతకు హెల్మెట్లను అందజేశారు. సంతాపూర్ గ్రామంలో ఇటీవల శ్రీకాంత్ మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులకు రూ.5వేలు, పోమాల్‌పల్లిలో కృష్ణయ్య మృతి చెందడంతో అతడి కుటుంబ సభ్యులకు రూ.5వేలు, తొమ్మిదిరేకుల గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఆంజనేయులు కుటుంబ సభ్యులకు రూ.5వేలు, ప్రమాదంలో గాయపడిన శ్రీశైలంకు ఆస్పత్రి ఖర్చులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో సంతాపూర్ సర్పంచ్ అంజయ్య, మోహన్‌సింగ్, నరేందర్‌రెడ్డి, మహేశ్, మాణిక్యం, నరసింహ, శ్రీకాంత్, సాయి, నాగరాజు, మచ్చేందర్, కేశవులు, భరత్, నరేందర్, తిరుపతి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ కాల్వ ప్రారంభోత్సవంపై దుమారం

ఎంపీడీఓకు ఫిర్యాదు



కాసింబౌలి సర్పంచ్‌పై ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న ఉపసర్పంచ్ తదితరులు

మొయినాబాద్‌రూరల్: కాసింబౌలిలో యూజీడీ కాల్వ నిర్మాణంపై అనవసర రాద్దాంతం చేస్తున్నారని ఉపసర్పంచ్ జయరాంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై గురువారం ఆయన ఎంపీడీఓ సంధ్యకు ఫిర్యాదు చేశారు. ఇళ్ల మధ్య మురుగు పారుతుండడంతో మాజీ ఉపసర్పంచ్ దయాకర్‌రెడ్డి, గ్రామస్తుల సహకారంతో యూజీడీ కాల్వను నిర్మించామని ఉపసర్పంచ్ జయరాంరెడ్డి ఎంపీడీఓ సంధ్యకు వివరించారు. యూజీడీ కాల్వ ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించడలేదని వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. తనను రాజకీయంగా దెబ్బతీసేందుకు సర్పంచ్ ఎంపీఓ, పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడని ఆరోపించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓను కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో గ్రామస్తులు ఎస్.మోహన్‌రెడ్డి, వై.శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రెడ్డి, డి.మహేష్, బి.భిక్షపతి, జి.నర్సింహ్మారెడ్డి, జంగయ్య, ఎం.సుధాకర్‌రెడ్డి, మాడి రాజేందర్‌రెడ్డి, జి.శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పట్టుపట్టారు.. కొలువు సాధించారు

మండల పరిధిలోని పలువురు అభ్యర్థులు కష్టపడి చదివి కలల ఖాకీ కొలువు సాధించారు. బుధవారం టీఎస్‌పీఎల్‌ఆర్‌బీ విడుదల చేసిన ఫలితాల్లో 14 మంది కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు.

- సర్కార్ ఉద్యోగం సాధించిన యువత
- ఆనందంలో తల్లిదండ్రులు, గ్రామస్తులు

మొయినాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో కష్టపడిన యువకులు కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. బుధవారం విడుదలైన కానిస్టేబుల్ తుది ఫలితాల్లో మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 14 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. వీరంతా పేద, రైతు కుటుంబాలకు చెందినవారే. కొంత మంది మూడు పర్యాయాలుగా ప్రయత్నం చేసి విజయం సాధించగా మరికొందరు తొలి ప్రయత్నంలోనే కొలువు సాధించారు. కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికైన వారిలో మేడిపల్లికి చెందిన ఆనంద్, రెడ్డిపల్లికి చెందిన శేరి శంకర్, చిన్నమంగళారం గ్రామానికి చెందిన గన్నెపాగ శ్రీకాంత్, చందానగర్‌కు చెందిన కుమ్మరి ఆనంద్, వినయ్‌గౌడ్, శ్రీరాంనగర్‌కు చెందిన పులిమామిడి లింగంగౌడ్, కొంగుపల్లి రజినీకాంత్‌యాదవ్, వెంకటాపూర్‌కు చెందిన కుమ్మరి అనిల్, పెద్దమంగళారం గ్రామం నుంచి బుజంగరెడ్డి, బ్యాగరి ప్రశాంత్, పులగళ్ల జోనేష్, మందడి మనోహర్‌రెడ్డి, సజ్జన్‌పల్లికి చెందిన ఉదయ్‌భాస్కర్‌లున్నారు.

ఖాకీలుగా అన్నదమ్ములు




కె.కృష్ణ, కె.వినోద్, ఇబ్రహీంపల్లి

చేవెళ్ల మండల పరిధిలోని ఇబ్రహీంపల్లిలో అన్నదమ్ములు ఒకేసారి కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. కడుమూరి వెంకటేశ్, లలిత దంపతులకు ఇద్దరు కొడుకులు. కృష్ణ, వినోద్ ఇద్దరూ రెండు పర్యాయాలుగా కానిస్టేబుల్, ఎస్సై ఉద్యోగాలకు ప్రిపేర్ అయ్యారు. గతంలో ఒక మార్కు తక్కువ రావడంతో ఇద్దరు అర్హత సాధించలేదు. ఈసారి మరింత కష్టపడి ఇద్దరూ ఒకేసారి కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించారు. తల్లిదండ్రులతోపాటు బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అక్క స్ఫూర్తితో



మొదటి సారి కొద్ది తేడాతో ఉద్యోగం సాధించ లేకపోయా. ఈ సారి మరింత కష్టపడి చదివా. మా అక్క కానిస్టేబుల్ కావడంతో మరింత స్ఫూర్తినిచ్చింది. పట్టుదలతో చదివి విజయం సాధించాను. కానిస్టేబుల్ ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది.

– శేరి శంకర్, రెడ్డిపల్లి, మొయినాబాద్

2016 నుంచి ప్రయత్నిస్తున్నా



చిన్న నాటి నుంచి పోలీస్ కావాలనేది నా కల. 2016 నుంచి ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. మూడు సార్లు ప్రయత్నించగా చివరకు ఫలితం దక్కింది. తల్లిదండ్రులు, స్నేహితుల ప్రోత్సాహంతో విజయం సాధించాను. చాలా సంతోషంగా ఉంది.

– బుజంగరెడ్డి, పెద్దమంగళారం, మొయినాబాద్

కేటీఆర్ సభకు బీఆర్‌ఎస్ శ్రేణులు

కొందుర్గు: షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించిన మంత్రి కేటీఆర్ సభకు కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండలాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. మండల కమిటీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, సయ్యద్ హఫీజ్ ఆధ్వర్యంలో వేలాదిమంది కార్యకర్తలు తరలివెళ్లినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా మండల కేంద్రాల్లో భారీ ర్యాలీలు చేపట్టారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

నేటి నుంచి డీఎస్పీ ఇంటింటి ప్రచారం

కొందుర్గు: ఈ నెల 6 నుంచి 11 వరకు జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు మండలాల్లో ధర్మ సమాజ్ పార్టీ గడప గడపకు ప్రచారం కార్యక్రమం ఉంటుందని డీఎస్పీ రాష్ట్ర ప్రచార కమిటీ నాయకులు మంచాల భిక్షపతి తెలిపారు. గురువారం మండల కేంద్రంలో కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భిక్షపతి మట్లాడుతూ విశారదధన్ మహరాజ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని.. రెండు మండలాల పరిధిలోని అన్ని గ్రామాల్లో గడప గడపకు డీఎస్పీ కార్యక్రమం పూర్తయిన తర్వాత 11న మండల కేంద్రంలో ముగింపు కార్యక్రమం ఉంటుందని చెప్పారు. రైతులు, కార్మికులు, మహిళలు తమతో కలిసి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, శ్రీను, గిరి, రవీందర్, నర్సింలు, సంజీవ, రాములు, అశోక్, నరేశ్, సిద్దు, మల్లేశ్, రాములు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమాన్ని చూసి స్వచ్ఛంద చేరికలు



ఎమ్మెల్యే యాదయ్య సమక్షంలో పార్టీలో చేరుతున్న జాలగూడ యువకులు



జైపాల్ యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: మండల పరిధిలోని అల్లవాడ అనుబంధ గ్రామం జాలగూడకు చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు గురువారం ఎమ్మెల్యే కాలె యాదయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం, సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి చాలా మంది పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరినవారిలో కురుమ సంఘం మండల ప్రధాన కార్యదర్శి తిరుమలి కుమార్, గ్రామ సీనియర్ నాయకులు అమరేందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, బాలరాజు, మల్లేశ్, రాజేందర్‌రెడ్డి, జంగారెడ్డి, ప్రవీణ్, కుమార్, మాజీ ఉపసర్పంచ్ జంగయ్య తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, వైస్ ఎంపీపీ శివప్రసాద్, నాయకులు రాజేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గులాబీ గూటికి కాంగ్రెస్ శ్రేణులు

షాద్‌నగర్‌రూరల్: కాంగ్రెస్‌కు చెందిన పలువురు నాయకులు గురువారం బీఆర్‌ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎంపీ మన్నెశ్రీనివాస్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. పార్టీలో చేరిన వారిలో సుధాకర్‌గౌడ్, అన్వర్, సాజిద్, రాజు, జగదీశ్ తదితరులున్నారు.